# ఎటాక్

రెండేళ్ళ క్రిందట ఒకరి శరీరంలో ఒకరు అర్ధభాగాలను ఆక్రమించుకున్న జటాధరం - కలహంసల జీవితం - ఇప్పుడు చినికి చినికి గాలివానగా మారింది. ఈ రెండేళ్ళలోనూ వాళ్ళ ప్రయాణం రైలు పట్టాలమీద రైలు బండిలా సాఫీగానే సాగింది.

కాని, ఇవాళ వాళ్ళది బస్సు ప్రయాణం గతుకుల రోడ్లు.

ఇన్నాళ్ళూ కూరలో ఉప్పు ఎక్కువైనా, కారం ఎక్కువైనా సర్దుకుపోయేవాడు జటాధరం. కాకరకాయ పులుసైనా తియ్యగా వుండేది. ఇప్పుడలా కాదు.

"గూబగుయ్ మనిపిస్తాను జాగ్రత్త!"

'కలహం'స మాత్రం తక్కువ తిందా?

"డిటో నేనేం అబలను కాను. నా బలం ఏమిటో నిరూపిస్తాను."

"నువ్వు నంబర్‌వన్ మూర్ఖురాలివి!"

"నువ్వు అంతకు వందరెట్లు మూర్ఖుడివి!"

పోనీ వీళ్ళిద్దరూ ఒక బిడ్డకైనా 'మాతృదేవోభవ - పితృ దేవోభవలు' అయినా బావుండును. ఆ పసికందు చిరునవ్వుకి వీళ్ళ ఆవేశాలు చల్లారి మళ్ళీ మామూలు అయిపోదురు.

ఇద్దరి ఆవేశాలు తారస్థాయికి చేరినప్పుడు ఒకరైనా తగ్గాలి. లేకపోతే ఆవేశంలో వివేకం, విచక్షణ కోల్పోతారు.

మరోనాడు జటాధరం భోజనం చేస్తూ "ఏమిటి వంట? మనుషులు తినవలసినవేనా

ఈ కూరలు?" అంటూ కంచం విసిరేశాడు.

"జాగ్రత్తగా మాట్లాడు! నేనేం వంట పుట్టిననుకున్నావా? ఎలాగో అలాగ సర్దుకు పోవాలి. లేకపోతే హోటల్‌కి పో! వాడు పిండి రుబ్బుతూ ఆ పిండిలో చెమటని దులుపుతాడు. సాంబారులో నీముందే బొద్దింకను తీస్తుంటే మహారుచిగా వుంటుంది!వెళ్ళు వెళ్ళు" అంది కలహంస.

"ఏమిటే పేలుతున్నావు!" అని జటాధరం రుద్రుడయితే -

"నువ్వేంట్రా పేలుతున్నావ్?" అని కత్తిపీట ఎత్తుతూ రుద్రాణి అయింది కలహంస.

ఇరుగు పొరుగు వారు వీళ్ళ గొడవల్ని గమనిస్తూనే వున్నారు. కానీ, ఎవరూ జోక్యం చేసుకోవడానికి వీల్లేని పరిస్థితి.

"మా కుటుంబ కలహాల్లో మీరెందుకు జోక్యం చేసుకోవాలి? మీ కుటుంబ కలహాల్లో మేం జోక్యం చేసుకున్నామా? మీరు తాగేసి మీ ఆడవాళ్ళ జుత్తు పట్టుకుని చావ బాదుతుంటే మేం తల దూర్చేమా? మీ హద్దుల్లో మీరుండండి!" అంటే?

అందుకే ఎవరూ వాళ్ళ విషయంలో కలుగజేసుకోలేదు.

ప్రతి కుటుంబంలోనూ ఇది వున్నదే! కాకపోతే కొందరు పైకి వెళ్ళగ్రక్కుతారు. కొందరు లోలోన కుమిలిపోతుంటారు. ఎంతో 'ఆదర్శ' దంపతుల్లాగా నటిస్తారు కొందరు. ఆ సో - కాల్డ్ ఆదర్శ దంపతులది 'నటన' అని తెలియక "వాళ్ళని చూసి బుద్ధి తెచ్చుకోండి మీరు" అని మిగిలిన కుటుంబాలవారు అనుకుంటుంటారు.

ఒకనాడు హఠాత్తుగా "రక్షించండి! రక్షించండి!" అనే గావు కేకలు వినబడ్డాయి.

అది ఆడగొంతుక. నిశ్చయంగా కలహంసదే! ఇరుగు పొరుగు వారు పరుగు పరుగున వెళ్ళారు.

ఆమె భర్త జటాధరం తలుపులు తెరచుకుని బయట పడ్డాడు.

కలహంస మంటల్లో భగ్గుమంది!

"బాబోయ్! తను కిరసనాయిల్ ఒంటిమీద పోసుకుని అగ్గిపుల్ల గీసుకుని నన్ను మంటల్లోకి లాగబోయింది! తప్పించుకున్నాను" అరిచేడు జటాధరం.

పోలీసులకు కబురందింది. వచ్చి జటాధరాన్ని అదుపులోకి తీసుకున్నారు.

కలహంస శవాన్ని పోలీసులు పోస్టుమార్టమ్ చేయించారు. మంటల్లో పడి కాలిపోయినట్టు తెలుస్తూంది కాని, ఆమె భర్త ఆమెను మంటల్లో తోసేసినట్టు ఋజువుతేదు.

ఫలితం, జటాధరం విడుదల!

కలహంస వంటింట్లో పడి అరుస్తున్నప్పుడు, తలుపు కన్నంలోంచి చూశాడు ఒక ప్రక్కింటాయన. జటాధరం వంటి దుర్మార్గునికి శిక్ష పడాల్సిందే అనుకుంటూ సాక్ష్యం ఇద్దాం అనుకున్నాడు.

అతని భార్య జోక్యం చేసుకుని, లోనికి రమ్మని సైగ చేసింది. ఆయన లోనికెళ్ళేక "చచ్చిందేదో చచ్చింది. మళ్ళీ బతికి బట్టకట్టదుకదా! మీరెందుకండీ కోర్టుల చుట్టూ తిరగడం?" అని మెత్తగా మందలించింది.

"కట్టుకున్న భార్యని చేజేతులా మంటల్లో కాల్చిన దుర్మాడికి శిక్ష పడొద్దుటే"? అన్నాడు ఆవేశంగా'

"మనకో పెళ్ళికాని అమ్మాయి - సరమ - ఉంది. చచ్చిందాని మొగుడిది గవర్నమెంటు నౌఖరీ. మన సరమనిచ్చి పెళ్ళి చేస్తే ఎలా వుంటుంది? మనమ్మాయిని కూడా మంటల్లోకి తోసేస్తాడేమో అని మీరు అనుకోవచ్చు. మళ్ళీ రెండోసారి అలా చేస్తే, వీడు నిజంగా మొదటి పెళ్ళాన్ని కూడా చంపే వుంటాడు అని అనుమానిస్తారు పోలీసులు. అంచేత అలాంటి పని ఎప్పటికీ చేయడు. పైగా రెండో పెళ్ళివాడు కనుక తక్కువ కట్నంతో వస్తాడు".

జటాధరానికి వ్యతిరేకంగా సాక్ష్యం ఇద్దామనుకున్న వ్యక్తి మరి కిక్కురు మనలేక పోయాడు.

పోలీసు వాళ్ళడిగితే "నేను చూళ్ళేదండీ! నాకేమీ తెలియదు"- అని తప్పించుకున్నాడు.

కాలక్రమేణా విషయం పాతబడుతోంది. ఒకనాడు జటాధరాన్ని సరమ తండ్రి కలిసి "బాబూ! ఎన్నాళ్ళిలా వండుకుంటూ కాలక్షేపం చేస్తావు?" అన్నాడు. "నిజమే, మరి నాకు వండి పెట్టే వాళ్ళెవరున్నారు చెప్పండీ?" అన్నాడు. "మా అమ్మాయి సరమ వుంది బాబూ నీకు వంట చేయడానికి. నీ కాళ్ళు కడిగే అవకాశం కలిగించు బాబూ నాకు" "ఔను బాబూ! మా అమ్మాయిని చేసుకో. నీ ఒంటరితనం చూస్తే గుండె

తరుక్కుపోతుంది" అంది సరమ తల్లి, భర్తకు మద్దతు ఇస్తూ.

"నాకేం అభ్యంతరం లేదు మీ అమ్మాయిని చేస్కోడానికి మీ అమ్మాయిని కనుక్కోండి" అన్నాడు జటాధరం. సరమ తల్లిదండ్రులు మెలికలు తిరిగిపోయారు. సరమతో ఈ ప్రస్తావన తెచ్చారు. "ఈ దుర్మార్గుడినా నన్ను పెళ్ళి చేసుకోమంటున్నది - నాకు వద్దు!" అని నిష్కర్షగా చెప్పేసింది.

"గవర్నమెంట్ నౌఖరీ కదమ్మా! రిటైరయేక పింఛన్ కూడా వస్తుంది. ప్రైవేట్ కంపెనీల్లో లాగా కష్టపడి పనిచేయక్కర్లేదు. ఆలోచించు" సముదాయించబోయారు తల్లిదండ్రులు.

"రిటైరయే వరకూ నన్ను బతకనిస్తాడా? ఈ రాక్షసుడు ఒక వేళ నేను చచ్చేక, వీణ్ని న్యాయ స్థానం శిక్షించినా నేను మీకు దక్కను కదా! మహావిష్ణువు పది అవతారాలెత్తి ఎంతోమంది రాక్షసుల్ని చంపాడు. కానీ మనుషుల్లోని 'రాక్షస ప్రవృత్తి'ని చంపలేక పోయాడు. ప్రహ్లాదుడు, విభీషణుడు రాక్షసులే! కాని వారిలో 'మానవ ప్రవృత్తి' వుంది. దయ. క్షమా గుణం వారిలో వున్నాయి.

'మాంగల్యం తంతునా నేన మమ జీవన హేతునా' అంటూ మాంగల్యాన్ని తంతునా? అంటూ మంగళ సూత్రాన్ని తన్నేసేవాణ్నా నన్ను పెళ్ళి చేసుకోమంటున్నారు? మీరు తల్లిదండ్రులా, కసాయివాళ్ళా?" అంటూ ఎటాక్ ఇచ్చింది సరమ.

**10 - 17 ఫిబ్రవరి 2001 - సుప్రభాతం వీక్లీ**